'డియర్ గెస్ అలవెన్సు మాట తరవాత ఆలోచిస్తావుగా-?'

'ఓ! సరేగాని, రేపు మనం ఏజంట్లు కావాలని 'హిందూ'లో వేయబోయే అడ్వర్టయిజ్మెంటుకు చార్జి ఎంతవుతుందో తెలుసునా?'

'తెలీదు!'

'ఎనిమిది రూపాయలకంటే అవదు-'

'ఇంతేనా?'

'ఇంతే!'

'అయితే రేపే రాసి పంపించేద్దాం?'

'సరే కాని ఇలా చూడూ, ఈ నెలాఖర్న నీకు నేను ఇవ్వబోయే పదహారువేలతోబాటూ కలిపి యిచ్చేస్తాను గాని, ఎనిమిది రూపాయలుంటే ఇట్టా ఇవ్వు-'

'...............?'

## అందాల వేట

అందచందాలు పుట్టకతో రావాలిగాని కొనుక్కుంటేనూ, అంటించుకుంటేనూ వస్తాయా అంటూంటారు పెద్దవాళ్లు. ఇందులోని సత్యాన్ని యేనాడో కాదంది మన ప్రపంచం-

అందంగా కనుపించ దలచుకున్నవాళ్లకి అందచందా లక్కర్లేదు. పుట్టకతోనే వెన్నెల తీగలకుమల్లే ప్రకాశించ నక్కర్లేదు.

అందమంటే నలుగురిలోనూ రాణింపు - కొస్త నిగనిగ - కొంచం తళుకూ, బెళుకూ. పుట్టకతో వచ్చేది శరీరమూ, అవయవాలున్నూ. అందంకాదు. అందమనేది ఆ శరీరంమీదా, అవయవాలమీదా కాల క్రమేణా తీర్చి, దిద్దుకుంటూండాల్సిన తీరువు.

అందమైన అమ్మలక్కలు పుట్టరు-పుట్టిన పిమ్మట రత్నాలకుమల్లే సానపెట్ట బడతారు. ఇదీ అందాల తీరు.

మీరు అందంగా పుట్టలేదనీ, మీ మూతి కోతిమూతిలా వుంటుందనీ, మీరూపం దుమ్ములగొండిని పోలివుంటుందనీ మీరు చిన్నబుచ్చుకో నక్కర్లేదు.

మీకు అందం కావల్సిన వయస్సు వచ్చేసరికి దాన్ని మీరు బజారుకు వెళ్ళి అంగి పుచ్చుకున్నట్టుగా రూపాయి అణా పైసలతో కొనుక్కోవచ్చును, మీ నాన్న చుట్టలు కొనుక్కున్నట్టుగానూ, మీ అన్న కిళ్ళీ కొనుక్కున్నట్టుగానూ, మీరు పలకలూ, పలకపుల్లలూ కొనుక్కున్నట్టుగానూ. మీకు కావలసినప్పుడు అందాన్నే ఇవ్వలేకపోతే ఎందుకూ ఈ నాగరికతలూ, విజ్ఞానాలూ, పరిశోధనలూ, ఇవన్నీను!

అందం ముఖ్యంగా కావల్సింది ఆడవారికి. ఎందుకని నన్ను అడక్కండి. ఈ అందమనేది ప్రతి చిన్నదానికీ పది సంవత్సరాలు పైబడిన దగ్గర్నుంచీ అవసరమై, ఆపైన సర్వీసులో వున్న ఉద్యోగికి మల్లే ఏళ్ళు గడిచిన కొద్దీ ప్రమోషన్ కోరుతుంది.

పది సంవత్సరాల లోపు పిల్లలైతే చీమిడి ముక్కుతో వున్నా, చీదర మొహాలతో వున్నా, మాసినపరికిణీ కట్టుకున్నా లక్ష్యపెట్టేవారూ, తప్పుపట్టేవారూ అరుదుగా వుంటారు. కాని, ఆపైన అలాగ వుండడానికి వీల్లేదు. అందాలవేటకు బయల్దేరాలి.

ఎందుకు బయల్దేరాలో మీరు అడగవలసింది నన్ను కాదు!—

అందమనేది ఈ రోజున ముఖ్యంగా కట్టుబట్టలమీద ఆధారపడి వుంది. రోజుకి ఎన్ని చీరలు, ఎన్నెన్ని రకాల చీరలు కట్టి విడుస్తూంటే అంత అందం మీ పాలబడుతుంది. అంత ఆకర్షణ మీ చేతిసొమ్ము. అందమైన చీరకట్టి కూడా ఈ రోజుల్లో పరాయి ముఖాలను తనవైపుకు త్రిప్పించుకోలేని స్త్రీకి కాల్చినా అందంరాదు.

మీకు అందంలేదని నిరుత్సాహపడకండి. వెంటనే మీకు సమీపంలో వుండే చీరల స్పెషలిస్టులవద్దకు వెళ్ళండి. మీ ముఖం చూడ్డంతోనే మీకు అందాన్నిచ్చే చీర ఎటువంటిదయ్యుంటుందో వారు గ్రహించి, దాన్ని మీకు చుట్టబెట్టి మిమ్మల్ని సర్వాంగ సుందరంగా తయారుచేసి పంపిస్తారు. మళ్ళీ మళ్ళీ వాళ్ళదగ్గరకు వెళ్ళి కనుక్కుంటూంటే ఎప్పుడు ఏయే కొత్తరకాలు వచ్చాయో అవన్నీ మీకు చూపిస్తూ, మీ అందానికి కొత్త మెరుగులు పెడుతూంటారు—

చీరలద్వారా మీరు సంపాయించుకున్న అందానికి తోడు కొని-ఆభరణాలు కూడా వుంటే బంగారానికి తావి అబ్బినట్టుగా వుంటుంది

భయపడకండి. గంగిరెద్దులకు మల్లే కాసులపేర్లూ, మొహిరీలూ మీరు వెయ్యనక్కర్లేదు. అటువంటి సలహా మీరు కోరినా ఎవరూ ఇవ్వడానికి సిద్ధంగాలేరు ఈ రోజుల్లో. పోతే, ఒకపేట చెయినూ, చెవులకు లోలాకు-కాదు - ఇప్పుడొస్తూండే కొత్తరకపు జూకాలూ-చేతులకు రెండు జతలు గాజులూ-లోహపువి, ఏలోహపువైనా సరే.

చేతులకు రెండు జతల లోహపు గాజులు చాలును. ఆపైన ఒక పాతిక జతల గాజు గాజులు-గ్లాస్ బ్యాంగిల్సు-అంటారు వీటినే కాబోలు. ఇవి చేతి మణికట్టు దగ్గర్నుంచి మోచేతివరకూ వుంటే మీ చేతులు ఎంతైనా రాణిస్తాయి—

మోచేతివరకూ గాజులు వేసుకోడానికి ఈ రోజుల్లో కదుపుతూండ నక్కర్లేదు. అంగుచేత అటువంటి భీతిని విడవండి.

అయితే ఒక్కమాట—

ఈ గాజులు మాత్రం గాజుల మల్లారంలో కొనకండి. గాజులవాడి ముందు కూర్చుని వాడు వేసే గాజులు తొడుక్కోవడమంత చిన్నతనం వేరేలేదు ఈ రోజుల్లో. షాపుల్లోకి వెళ్ళండి-అక్కడ కొత్తరకం సరుకుంది-గాజులవాడు ఒక గాజు అర్ధణాకిస్తే, షాపులో ఒక అర్ధ రూపాయి-అయితేనేం గాక!

చేతికి రిస్టువాచీ, కళ్ళకు జోడూ ఈ రోజుల్లో అందాన్నివ్వడం మానుకున్నాయి. కాని, చేతిలో ఒక వేనిటీ బేగ్, కాలికి శాండల్సు ఇంకా మోజులోంచి తప్పుకోలేదు. పౌడరు ఫరవాలేదు.

వీలైతే నఖాలు ఎప్పటికప్పుడు "క్లిప్" చేయడం, ఎర్రరంగు పూయడం-కళ్ళకు లేతగా కాటుకొకటి-ఇప్పుడు మీ అందాల సంచీలో వుండి తీరాలి. ఇది ప్రచారంలో వుంది-

కేశ సౌభాగ్యమే వుంటే అందంలేదని మీరు జడవనక్కర్లేదు. అందంలేని లోటును దీర్ఘమైన జడలు కప్పి పుచ్చుతాయి. ఒక నిండైన జడ ఎంతో అందాన్నిస్తుంది. రెండు జడలు మరీ అందాన్నిస్తాయి. మూడు జడలు ఇంకా ఇంకా అందాన్నిస్తాయి—

జడలు మీ యిష్టమొచ్చినంత పొడుగ్గా పెంచండి. ఎంత పొడుగుంటే అంత అందం, అంత ప్రయోజనం—అవసరమొస్తే పొడుగైన, త్రాచు పాముల్లాంటి జడలతో మీ ప్రియులను బంధించవొచ్చు, వారి మెడకు ఉరిపెట్టవచ్చు......

కొందరికి పాపం కేశసౌభాగ్యం చాలినంత, కోరినంత వుండదు-ఏ "రీటా" వాడినాకూడా వాటికి సత్తువ రాకపోతే, అవి ఎదగకపోతే— మీరు ముఖం అలా పెట్టుకొని యిదవనక్కర్లేదు. ఎలకతోకంత జడను వేసుకుని దాన్ని వీపుమీద వుండే పమిటచెంగుచాటున దాచుకోండి. ఇలా అయితే జడ వున్నట్టూ తేలుతుంది, అదొక ఫ్యాషన్ లాగా వుంటుంది.

అక్కడికీ మీకు తృప్తిలేకపోతే, ఇంకా పొడుగైన-కోడ్డు తుడవడానికి వీలైనంత జడ కావలిస్తే-ఇలా అంటున్నానని కోపించకండి— పొడుగాటి రెడీ-మేడ్ కేశ సముదాయాన్ని కొనుక్కొని దాన్ని ఎలాగో మీ కాస్తజుట్టుకూ ముడిపెట్టి వ్రేలాడేట్టు చేయండి—అది నిజంగా మీ తలలోంచి పుట్టుకొచ్చిన కేశసంపదా, కృత్రిమ సముదాయమా అని ఎవ్వరూ శంకించరు. అలా శంకించడం, శంకించినా 'ఇదేమిట'ని అడగడం శిష్టసంఘంలో ఆచారం కాదు...

* * *

ఇంకేమిటీ?

ఇవన్నీవుండీ కూడా మీరు అందంగా వుండటానికి ప్రయత్నించాలి— అంటే వీటిని అవకాశం దొరికినప్పుడల్లా పబ్లిక్‌లో ప్రదర్శిస్తూండాలి— ఎప్పటికప్పుడు మీరు 'అందంగా వున్నాను' అనే విషయాన్ని స్ఫురణకు తెచ్చుకుంటూ, దాన్ని మరవకుండా వుండటానికి ప్రయత్నిస్తూ మిమ్మల్ని చూచేవారిలో కూడా 'ఈవిడ అందమైనదే-అందంగా కనుపించడానికి ప్రయత్నించేదే' అనే భావాన్ని కలిగించడానికి ప్రయత్నించండి-లేకపోతే నీ ప్రయత్నాలన్నీ బుగ్గి!